## క్లుప్తంగా

### నేడు పెరవలి మండల సమావేశం

పెరవలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో సీహెచ్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

**రేపు నిడదవోలు మండల సమావేశం**

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 31న మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు విధిగా సమావేశానికి రావాలని ఆయన పేర్కొన్నారు.

### క్రికెట్ టోర్నీకి నెలాఖరు వరకూ గడువు

గోపాలపురం: గత 12 ఏళ్లుగా నిర్వహిస్తున్న వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను 2025 సంవత్సరంలో కూడా నిర్వహిస్తామని గోపాలపురం వైఎస్సార్ యూత్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతుందన్నారు. టోర్నీలో పాల్గొనదలచిన టీమ్‌లు రూ.రెండు వేల ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెలాఖరులోగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. టోర్నీ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు ప్రదానం చేస్తామని నిర్వాహకులు వీఎన్‌డీ గణేష్, సంజయ్, రమణ తెలిపారు. బెస్ట్ బౌలర్‌కు రూ 3 వేలు బహుమతిగా అందజేస్తామన్నారు.

### ఆర్ఎంపీలు, పీఎంపీల శిక్షణ



పెరవలిలో రాష్ట్ర కమిటీ సభ్యులకు సన్మానం

పెరవలి: స్థానిక ఎస్సీ కల్యాణ మండపంలో ఆదివారం మండల స్థాయిలో ఆర్ఎంపీలు, పీఎంపీల శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తణుకు వేద ఆసుపత్రి వైద్యుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ వైద్యం చేసేటపుడు రోగం పెద్దదా, చిన్నదా అని గుర్తించిన తరువాత చికిత్స అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పీఎంపీల సంఘ మహిళా అధ్యక్షురాలిగా శాంతికుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులైన ఆగర్తి వెంకట కృష్ణారావును, పీఎంపీల సంఘ జిల్లా కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల పీఎంపీలు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: మోర్త సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ వేలివెన్ను ఫీడర్, 11 కేవీ చిలకపాడు ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం తెలిపారు. వ్యవసాయ బోర్లకు ప్రత్యేక 11 కేవీ ఫీడర్ లైన్ వేసే పనుల నిమిత్తం సరాఫరాను నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు. మోర్త గ్రామానికి కూడా విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

### పాలంగిలో నందీశ్వరునికి అభిషేకాలు



పాలంగి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

ఉండ్రాజవరం: త్రయో దశి సందర్భంగా ఆదివారం పాలంగి గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నందీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తీసుకు వచ్చిన వివిధ రకాల పండ్ల రసాలతో నందీశ్వరునికి అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు నందీశ్వరుడిని, శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే మాస శివరాత్రి సందర్భంగా కె.సావరం గ్రామంలో దుర్గామల్లేశ్వర స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఇటుక సంక్షోభం



అనంతపల్లిలో ఇటుకలు తయారు చేస్తున్న కూలీలు



బట్టీలో నిల్వ ఉంచిన ఇటుకలు

- అమ్మకాలు లేక బట్టీల యజమానుల విలవిల
- తయారీకి ప్రతికూల వాతావరణం
- కూలీలు, నిర్వాహకులకు గడ్డు పరిస్థితులు

నల్లజర్ల: ఇటుకల పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. గత సీజన్‌లో తయారైన ఇటుకలు కూడా ఇప్పటికీ అమ్ముడుపోలేదు. దానికితోడు కొత్త ఇటుకల తయారీకి వాతావరణం అనుకూలించడం లేదు. ఫలితంగా ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పనులు లేక కూలీలు.. ఇటుకలు అమ్ముడుపోక బట్టీల యజమానులు నానా అగచాట్లూ పడుతున్నారు. ఇసుక లభించక చాలాచోట్ల కొత్త భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఇటుకలు కొనే వారే లేకుండా పోయారని బట్టీల యజమానులు పేర్కొంటున్నారు. ఇంతకు ముందు తయారు చేసిన ఇటుకలు కూడా అమ్ముడు పోలేదని వారు చెబుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

మండలంలోని అనంతపల్లి పరిసరాల్లో 50 నుంచి 60 వరకూ ఇటుకలు తీసే బట్టీలున్నాయి. దాదాపు పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా అంతటికీ ఇక్కడి నుంచే ఇటుక సరఫరా జరుగుతుంది. వర్షాలు ప్రారంభం కాగానే బట్టీలన్నీ మూతపడ్డాయి. తయారీదారులు అప్పటికే అవసరానికి సరిపడా ఇటుకలు తయారు చేసి నిల్వ ఉంచారు. చిన్న బట్టీలైతే నాలుగు నుంచి ఐదు లక్షలు, పెద్ద బట్టీలైతే 10 లక్షల వరకూ ఇటుకలు నిల్వ పెట్టారు. బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌దారుల వద్ద, బంగారం తాకట్టు ద్వారా.. ఇలా ఎక్కడ వీలుంటే అక్కడ అప్పులు తెచ్చి మరీ ఇటుకల తయారీకి పెట్టుబడులు పెట్టారు. తీరా చూస్తే గత నాలుగు నెలలుగా ఇటుకల అమ్మకాలు లేవు. ప్రభుత్వం కేటాయించే గృహ నిర్మాణాలకు పెద్దఎత్తున అమ్మకాలు సాగుతాయని బట్టీల యజమానులు భావించారు. అయితే గృహ నిర్మాణాలపై కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయకపోవడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. ప్రభుత్వ గృహాల నిర్మాణం కాకపోతే, సొంతంగా ఇళ్లు నిర్మించుకునే వారైనా ఇటుకలు కొనుగోలు చేయకపోతారా? అని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఖర్చుల కోసం ఎంతో కొంత ధర తగ్గించి ఇద్దామన్నా ఇటుకలు కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని వీరంతా వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లతో పాటు ప్రైవేట్ గృహాల నిర్మాణాలు కూడా కుంటుపడ్డాయి. సాధారణంగా దీపావళి తర్వాత నవంబరు నుంచి మళ్లీ ఇటుకల తయారీ ప్రారంభం కావాలి. ఈలోగా ఉన్న ఇటుక నిల్వల విక్రయాలు పూర్తి కావాలి. అయితే అనంతపల్లి ప్రాంతంలోని మొత్తం బట్టీలలో 20 బట్టీలలో మాత్రమే మళ్లీ ఇటుక తీత ప్రారంభించారు. మిగతావన్నీ సంక్రాంతి తర్వాతే ప్రారంభించవచ్చు.

**పెరిగిన ఖర్చులు**

ఇదిలా ఉండగా ఇటుక నిర్మాణ ఖర్చులు బాగా పెరిగిపోయాయని బట్టీల యజమానులు చెబుతున్నారు. మట్టి ధర, కూలీల ఖర్చు, బొగ్గు, ఊక ధరలు రెట్టింపు అయ్యాయని వారు పేర్కొంటున్నారు. పక్కా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారునికి ఆది నుంచి ఉపాధి హామీ పథకం నుంచి ఇచ్చే నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. గృహ నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షిస్తుంటే ఉపాధి హామీ నిధులను సంబంధిత శాఖ మంజూరు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి రూఫ్ లెవల్ వరకూ ప్రతి ఇంటికి 90 ఉపాధి పని దినాల లెక్కన, రోజుకు రూ.300 చొప్పున (మరుగుదొడ్డి)తో మూడు దఫాలుగా లబ్ధిదారుని ఖాతాలో నిధులు జమ చేయాలి. ఈ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటున్నారు.

**తయారీ కష్టమే..**



నాణ్యమైన ఇటుకలు తయారు చేసి వంద రూ.800 రేటుకు అమ్మితే గిట్టుబాటవుతుంది. ప్రస్తుతం 100 ఇటుకల రేటు రూ.550 ఉంది.అయినా అమ్మకాలు లేవు. ముడి సరకుల ధరలు పెరిగాయి. ఈ పరిస్థితులలో ఇటుక తయారీ కష్టంగానే ఉంది. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా నామమాత్రపు వడ్డీకి రుణ సహాయం అందించాలి.

–ముతగాల వేణు, బట్టీ యజమాని, అనంతపల్లి

**గిట్టుబాటు కావడం లేదు**



2016లో వంద ఇటుక రూ.650 రేటుకు విక్రయించాం. ఇప్పుడూ అవే ధరలు. ముడి సరకులు ధరలు పెరిగాయి. రూ.లక్షలకు రూ.లక్షలు అప్పులు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టాం.అమ్మకాలు లేవు. ప్రభుత్వం గృహనిర్మాణాలను త్వరిత గతిన ప్రారంభిస్తే మాకు మేలు చేసినవారవుతారు.

–శ్రీకాకుళం విజయ్,(పండు) బట్టీ యజమాని, అనంతపల్లి

### వైద్య ఖర్చులకు 'మానవత' ఆర్థిక సాయం

ఉండ్రాజవరం: నలుగురు రోగుల వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సేవాసంస్థ మండల శాఖ ఆదివారం ఆర్థిక సాయం చేసింది. మోర్త గ్రామానికి చెందిన అయిశెట్టి ఏసుదాసు, కర్రి రమణ, నేమళ్ల లీలావతి, తాళం నాగమణి అనే నలుగురికి రూ.5 వేల చొప్పున చెక్కులను అందజేసింది. అంతకు ముందు పాలంగి గ్రామంలోని ఆ సంస్థ భవనంలో మానవత సేవాసంస్థ మండల శాఖ నెలవారీ సమావేశాన్ని సంస్థ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తాతిన కృష్ణారావు, వేలిచేటి బోస్, మండల కార్యదర్శి ఫణితిని పార్వతి, సుంకవల్లి కోటేశ్వరరావు, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### న్యూటన్ పాండుకు గ్లోబల్ పీస్ అవార్డు



గ్లోబల్ పీస్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు ఐజాక్ న్యూటన్ పాండు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు విప్పర్తి ఐజాక్ న్యూటన్‌పాండు ది అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గ్లోబల్ పీస్ అవార్డు –2024 పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని హోటల్ రివర్ బేలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ శాంతి దూత ది అమెరికన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్ చేతులు మీదుగా అందుకున్నారు.

## సమిశ్రగూడెంలో మెగా క్రిస్మస్ వేడుకలు



సమిశ్రగూడెం క్రిస్మస్ వేడుకల్లో వైద్య విద్యార్థిని ఆశా కీర్తికి సన్మానం



కలవలపల్లి క్రిస్మస్ వేడుకల్లో సందేశం ఇస్తున్న సల్మాన్‌రాజు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం మదర్ థెరిసా విగ్రహం వద్ద శాంతి సెంటర్ బాబూ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మెగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దైవజనులు డాక్టర్ వై.విజయ్‌కుమార్ క్రిస్మస్ వాక్యోపదేశం అందించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గజ్జరపు రమేష్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయంతో నిర్మించిన మదర్ థెరిసా విగ్రహంపై షెడ్డును వల్లమూడి దేవదాస్, సుదర్శన్ ప్రారంభించారు. వైద్య విద్యార్థిని ముప్పిడి ఆశాకీర్తిని యూత్ సభ్యులు సన్మానించారు. అనంతరం వృద్ధులకు, దివ్యాంగులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్రిస్మస్ పాక, చిన్నారుల యాక్షన్ సాంగ్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోగిన శ్రీనివాస్, ఎండీ అక్రం, ఉప్పులూరి రామ్మోహనరావు, దేశాబత్తుల నాగు, ఎం.రాజారత్నం, అంగర శ్రీను, షేక్ రహీం, స్థానిక యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**చిన్నారులకు దుస్తుల పంపిణీ**

కొవ్వూరు: పట్టణ శివారు జగనన్న కాలనీకి సమీపంలోని హౌస్ ఆఫ్ గ్రేస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. దైవ జనులకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా 32 మంది సండే స్కూలు విద్యార్థులకు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత చేతుల మీదుగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, నామన పరమేశ్వరరావు, చర్చి పాస్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**క్రీస్తు బోధనలు నేటి సమాజానికి ఆచరణీయం**

చాగల్లు: ప్రభువైన ఏసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి అవసరం, ఆచరణీయమని దైవ సేవకుడు రెవరెండ్ కె. సల్మాన్‌రాజు అన్నారు. కలవలపల్లిలో హోరేబు ప్రార్థనా మందిరంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ తోటివారి పట్ల ప్రేమ, దయ, కరుణ, కలిగి ఉండాలన్నారు. పేదల పట్ల ఆదరణ కలిగి, సేవా భావంతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో యూత్ సభ్యులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## కులగణనలో మాదిగలకు అన్యాయం

- తక్కువగా చూపించే ప్రయత్నం
- మాలలుగా మాదిగల నమోదు
- ఎస్సీ జాబితాలు సరి చూసుకునేందుకు గడువు పెంచాలని డిమాండ్
- ఎమ్మార్పీస్ ఉత్తర కోస్తాంధ్ర ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు



మాట్లాడుతున్న ముమ్మిడివరపు చిన సుబ్బారావు

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణ ఫలాలు పొందడానికి సంసిద్ధంగా ఉన్న సమయంలో కుల గణనలో తప్పుడు లెక్కలు పెట్టి మాదిగలు తక్కువగా ఉన్నట్టు చిత్రీకరించే ప్రయత్నాలు సాగుతున్నాయని ఉత్తర కోస్తాంధ్ర ఎమ్మార్పీస్ ఎంఎస్సీ అనుబంధ సంఘాల ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు ఆరోపించారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 ఎస్సీ వర్గీకరణలో భాగంగా మాదిగ ఉప కులాలన్నింటినీ మాలలుగా చూపించి మాదిగలకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎస్సీల వర్గీకరణలో ఏబీసీడీల్లో తప్పులను సరిచేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31 వరకూ సమయం ఇచ్చిందన్నారు. జాబితాలను సరి చూసుకునేందుకు ప్రభుత్వం మరింత సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తానిప్పటి వరకూ 75 పంచాయతీలను నేరుగా తిరిగి ఎస్సీ, ఎస్టీల జనాభా నిష్పత్తిని పరిశీలించానని చిన సుబ్బారావు అన్నారు. మాదిగలను మాలలుగా, మాదిగ క్రిస్టియన్, మాల హిందువులుగా నమోదు చేశారన్నారు. మాలలు, మాదిగలు ఎక్కడా నమోదు కాలేదన్నారు. మాదిగ దండోరా ఉద్యమంలో పని చేస్తున్న వారిని సైతం మాలలుగా చిత్రీకరించారని పేర్కొన్నారు. ఏ లెక్కల ప్రకారం చూసినా హిందూ ఆదిఆంధ్ర మాల,ఆది ఆంధ్ర మాదిగ అని ఉండేవారన్నారు. మాదిగలు తక్కువ, మాలల సంఖ్య ఎక్కువని చెబుతున్నారన్నారు. వీఆర్వోలుగా ఉన్న మాలలు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేలను కలుస్తామని, ప్రజా సమస్య పరిష్కార వేదిక–మీకోసంలో ఫిర్యాదులు చేస్తామన్నారు. జనాభా పరంగా చూస్తే మాలల కంటే మాదిగలు, మాదిగ ఉపకులాలు అధికంగా ఉన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్, ఉత్తర కోస్తాంధ్ర ఎమార్పీఎస్ అధ్యక్షుడు వరిగేటి కాంతరాజు, మనెల్లి కొక్కిరిగడ్డ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**కులగణన జాబితాలో తప్పులు సరిచేయాలి**

ఉండ్రాజవరం: ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ కులగణన జాబితాలోని తప్పులను సరి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దిద్దే మధుబాబు మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కులగణన జాబితాలను ప్రభుత్వం గ్రామ సచివాలయాల నోటీస్ బోర్డులలో ఏర్పాటు చేసిందన్నారు. చాలా గ్రామాల్లో ఎస్సీ మాదిగ కులానికి చెందిన వ్యక్తుల పేరు వద్ద ఎస్సీ మాల గా తప్పులు దొర్లినట్లు చెప్పారు. ఆ జాబితాలో కులం, పేరు, మతం ఎస్సీ మాదిగగా సరి చేయించుకోవాలని మధుబాబు కోరారు.

## 3న కొవ్వూరుకు సీఎం చంద్రబాబు!

- పర్యటన ఖరారు కావాల్సి ఉందంటున్న అధికారులు
- జగనన్న కాలనీలో ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు జగనన్న కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జనవరి మూడో తేదీన నియోజకవర్గంలో పర్యటించే అవకాశం ఉంది.రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన లక్ష గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం ఇక్కడకు విచ్చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చెబుతున్నారు. అయితే ఇంకా ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కాగా పట్టణ శివారు ఆరికిరేవుల రోడ్డు మార్గంలోని జగనన్న కాలనీని సీఎం చంద్రబాబు సందర్శించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం అధికారులతో కలిసి ఈ కాలనీలో పర్యటించారు. కాలనీలో పూర్తయిన గృహాల వివరాలు, సమావేశం నిర్వహణ ప్రదేశం, హెలిప్యాడ్ ఏర్పాటు ప్రదేశాలను పరిశీలించారు. కాలనీలో పరిస్థితులు, మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, టీడీపీ తాళ్లపూడి మండలశాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, రెవెన్యూ, విద్యుత్, గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హద్దు మీరితే చర్యలు తప్పవు

- న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు పాటించాలి
- కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం



పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు: నూతన సంవత్సర వేడుకలు జరుపునే వారు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పి.విశ్వం హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకలు జరుపుకునే వారు కచ్చితంగా పోలీసుల సూచనలను పాటించాలన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసుల అనుమతి లేకుండా న్యూ ఇయర్ వేడుకల నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టమ్ ఉపయోగించరాదన్నారు. అశ్లీల నృత్య ప్రదర్శనలను అనుమతించబోమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, వేగంగా వాహనాలు నడిపినా కేసులు నమోదు చేయడమే గాకుండా వాహనాలను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. ఇలాంటి వారిపై ఎంవీఐ యాక్టు ప్రకారం రూ.10 వేల జరిమానా, ఆరు నెలల వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని పది ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని సీఐ విశ్వం ప్రకటించారు. ఇష్టానుసారం వాహనాలు నడిపే వారిని చిత్రీకరించేందుకు వీడియోలు, కెమెరాలు, డిజిటల్ కెమెరాలు సిద్ధం చేసినట్టు సీఐ ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి పొందిన మద్యం దుకాణాలు, బార్‌లను నిర్దేశించిన సమయం వరకూ మాత్రమే నిర్వహించాలన్నారు. 31వ తేదీ రాత్రి అన్ని ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసిన తనిఖీలు చేస్తామన్నారు. ఏదైనా సమస్యలుంటే పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని, లేదంటే 94407 96622 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

కొవ్వూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 2025 సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, మండల కార్యదర్శులు షేక్ సలీం, ఆర్.వీరస్వామి, ఐ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ నిడదవోలు ఇన్‌చార్జిగా రాము

నిడదవోలు: ఎమ్మార్పీఎస్ నిడదవోలు ఇన్‌చార్జిగా గాలింకి రాము నియమితులయ్యారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ ఆధ్వర్యంలో కొవ్వూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. దీనిలో భాగంగా నిడదవోలు ఇన్‌చార్జిగా గాలింకి రాము నియమితులయ్యారు.

### ముగిసిన గ్రామ రెవెన్యూ సదస్సులు

దేవరపల్లి: మండలంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిశాయి. ఈ నెల 12న రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. 13 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. భూముల సమస్యలతో పాటు ఇతర సమస్యలను అధికారులు ప్రజల నుంచి తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులు ప్రశాతంగా ముగిశాయి. కురుకూరు రెవెన్యూ సదస్సులు అత్యధికంగా 143 అర్జీలు వచ్చాయి. రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలని 131 మంది రైతులు అర్జీలు అందజేశారు. సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎప్పటికపుడు ఆన్‌లైన్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించిట్టు అధికారులు తెలిపారు.

### పేకాడుతున్న 26 మంది అరెస్టు

**రూ.1.48 లక్షలు స్వాధీనం**

చాగల్లు: చాగల్లు గ్రామ శివార్లలోని కోళ్లఫారాల వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 26 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1.48 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు తెలిపారు.

## సుందేశ్వరస్వామికి విశేష పూజలు



కొవ్వూరులో సుందరేశ్వరస్వామి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరి స్వామి వారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ అనంతరం స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మ వారికి శ్రీ సూక్త విధానంలో కుంకుమ పూజ, స్వామివారికి బిల్వార్చన, రుద్రహోమం జరిపారు. గోవూరుకు చెందిన ధూళిపాళ్ల నరసింహ సోమయాజులు దంపతుల చేతులమీదుగా పూజలు జరిగాయి. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ప్రధానార్చకుడు మానేపల్లి శ్రీనివాస శాస్త్రి పూజలను పర్యవేక్షించారు. పండితులు కలిగొట్ల కృష్ణారావు, తెన్నేటి సూర్య నారాయణ ,తంగిరాల రామసోమయాజులు, మల్లా వెంకట శ్రీరామచంద్రమూర్తి, కందుకూరి లక్ష్మీనారాయణ శాస్త్రి, వైవీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో సోమేశ్వరుడు

**నిడదవోలులో మాస శివరాత్రి పూజలు**

నిడదవోలు: మాస శివ రాత్రి సందర్భంగా ఆదివారం స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గణపతి పూజ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

కొవ్వూరు: వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన చెక్కులను మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం అందజేశారు. ఈ గ్రామానికి చెందిన మాకా ఫణీంద్రకు రూ.1,60,646, అనిశెట్టి శ్రీదేవికి రూ.75 వేల విలువైన చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, సుంకర సత్తిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెండ్యాల శ్రీనివాస్, వెలుబండి వీర వెంకట్రావు, కొక్కిరిపాటి రాజు పాల్గొన్నారు.

### చాగల్లులో అన్న సమారాధన

చాగల్లు: హనుమత్ వ్రత మహోత్సవాల ముగింపు సందర్భంగా చాగల్లు మెయిన్ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిచారు. చాగల్లు, నెలటూరు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### సందడిగా ఫ్యాక్టరీ ఉద్యోగుల కుటుంబోత్సవం

దేవరపల్లి: యర్నగూడెం వద్ద గల 3 ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికుల కుటుంబోత్సవాన్ని శనివారం గాంధీనగరంలోని ఆదర్శ రైతు పిన్నమనేని రుషికేశవరావు ఆయిల్‌పామ్ తోటలో నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సుమారు 500 మంది ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలు వేడుకల్లో పాల్గొని సందడిగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటల,పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఋషికేశవరావు దంపతులను 3 ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఉద్యోగులు సన్మానించారు.

